**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**
**తేది : 04 ఆగష్టు, 2019.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం: వార్డు, పంచాయతీ, సచివాలయాల్లో ప్రస్తుతం వివిధ శాఖలలో పనిచేస్తున్న వారికి ప్రాధాన్యతనిమ్మని, ఉద్యోగ భద్రత కొనసాగించమని కోరుతూ...**

**ఆర్యా!**

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో 95,088 మంది ఉద్యోగులను మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో 31,640 మంది ఉద్యోగులను మొత్తం 1,26,728 మందిని కొత్తగా ఉద్యోగాల్లోకి తీసుకోవడానికై ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. రెండేళ్ళు ప్రొబేషనరీ పిరియడ్ 15 వేలు వేతనం అని ఆ తర్వాత రెగ్యులర్ స్కేలని ప్రకటించింది. వివిధ శాఖల ద్వారా నోటిఫికేషన్లను జారీ చేసింది. ఇది మంచి విషయం.

ప్రతి 2 వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయం ఏర్పాటు చేస్తామని, మున్సిపల్ ప్రాంతాల్లో వార్డు ప్రాతిపదికపై కార్యాలయం ఏర్పడుతుందని ప్రభుత్వం ప్రకటించింది. గ్రామ సచివాలయాల్లో 15 కేటగిరీల ఉద్యోగులు, వార్డు సచివాలయాల్లో 10 కేటగిరీల ఉద్యోగుల నియామకానికి పై నోటిఫికేషన్‌ను జారీ చేశారు. అయితే ప్రస్తుతం ఇదే ప్రాతిపదికపై అనేక మంది ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన 4–16 సం॥లుగా పనిచేస్తున్నారు. కొత్తగా పై తెలిపిన ఉద్యోగులను నియమించిన తర్వాత ఇప్పటికే పనిచేస్తున్న వారిలో తమ ఉపాధి పోతుందని ఆందోళన తలెత్తింది. నియామకాలు పూర్తయిన తరువాత వీరందర్నీ తొలగించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ, గ్రామ పంచాయతీ, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య అభివృద్ధి, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ, రెవెన్యూ, ఉపాధి హామీ, మున్సిపల్, సంక్షేమ, విద్య, విద్యుత్ తదితర శాఖలలో పై పనులు చేస్తున్న సుమారు 50 వేల మందిని కొత్త ఉద్యోగాలకై దరఖాస్తులు చేసుకోమని అధికారులు ఆదేశాలు కూడా ఇచ్చి ఉన్నారు. ఇది న్యాయ సమ్మతం కాదు. వీరి ఉపాధిని ఖరారు చేసి కొత్త వారిని నియమించడం సముచితమౌతుంది.

ప్రస్తుతం రాష్ట్రంలో 11,666 మంది ఏఎన్ఎంలు పనిచేస్తూ వున్నారు. వారిలో 8 వేల మంది డిఎస్సీ, మెరిట్ ద్వారా అన్ని విధాల అర్హత కలిగినవారు ఎంపికై ఉన్నారు. వారు సుమారు 15 సంవత్సరాలుగా పనిచేస్తూ ఉన్నారు. ప్రస్తుతం 13,540 కొత్త ఏఎన్ఎంల పోస్టుల భర్తీకి కుటుంబ ఆరోగ్యశాఖ డైరెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న 11,666 మంది ఏఎన్ఎంలకు దరఖాస్తులు చేసుకోమని 10% మార్కుల వెయిటేజీ ఇస్తామని రాత పరీక్షలో నెగ్గిన వారితో కొత్త పోస్టుల్లో భర్తీ చేస్తామని చెప్పారు. అంటే కొత్తగా ఏఎన్ఎంలు వచ్చిన తరువాత ప్రస్తుతం ఉన్న 11,666 మంది తొలగింపబడతారని ఉద్యోగులలో ఆందోళన ప్రభలింది.

**"త్రిప్పి చూడగలరు"**

ప్రస్తుతం ఎంపిఇవోలుగా ఉన్న 3 వేల మంది, ఎంపిఎఫ్‌వోలుగా ఉన్న దాదాపు 2 వేల మంది, వెటనరీ అసిస్టెంట్లుగా ఉన్న దాదాపు 1000 మంది, గోపాలమిత్రలుగా పనిచేస్తున్న 3 వేల మంది, హార్టీకల్చర్‌లో, సెరీ కల్చర్‌లో, విద్యుత్ శాఖలో సుమారు 15 వేల మంది, ఔట్‌సోర్సింగ్ మీటర్ రీడియర్స్ మరియు బిల్ కలెక్టర్లు, విద్యాశాఖలో సుమారు 4,500 మంది, ఆరోగ్య సహాయకులుగా ఉన్న 3 వేల మందికి పైగా ఉద్యోగులకు ఉపాధి పోతుందని ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ పనులన్నీ ప్రస్తుతం ఎంపికచేయబోయే కొత్త ఉద్యోగులకు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం మహిళా శిశుసంక్షేమ శాఖలో సుమారు 6 వేల మంది రిసోర్సు పర్సన్స్ ఉన్నారు. గ్రామ సచివాలయాలు ఏర్పడిన తరువాత వీరికి ఉద్యోగముండదు. పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు కొన్ని వేల మంది రాష్ట్రంలో ఇప్పటికే పనిచేస్తున్నారు. గ్రామ డిజిటల్ సహాయకులు వచ్చిన తరువాత కంప్యూటర్ ఆపరేటర్ల ఉద్యోగాలు ఉండవు. మున్సిపాలిటీలలో నియామకాలు పూర్తయిన తరువాత అక్కడ వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉన్న ఉపాధి పోతుందని ఆందోళన చెందుతున్నారు.

అలాగే ప్రస్తుతం ఆశా ఉద్యోగులు (43 వేల మంది), విఓఎలు (27 వేల మంది), బీమా మిత్రలు (1500 మంది), కళ్యాణమిత్రలు (1500 మంది), పశుసంఖిలు (15 వేల మంది)కి ఉపాధి పోతుందన్న ఆందోళన కూడా బయలుదేరింది. అలాగే గోపాలమిత్ర లాంటి పథకాలన్నీ గ్రామ సచివాలయాలే చేస్తాయి. అలాగే ఉపాధి హామీ శాఖలో కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు (5,700 మంది) ఉపాధి కోల్పోతారు. వీరి అనుమానాల్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

స్థూలంగా వార్డు, గ్రామ సచివాలయాల్లో నియామకాల వలన పై విభాగాలలో ఇప్పటికే పనిచేస్తున్న 50 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, వివిధ పథకాలలో పనిచేస్తున్న ఉద్యోగులు 78 వేల మందికి ఉన్న ఉద్యోగాలు పోతాయన్నదీ తీవ్ర సమస్యే.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న పై శాఖల ఉద్యోగులకు భద్రత కల్పించి కొత్త వారిని నియమించమని విజ్ఞప్తి చేస్తున్నాము.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి